క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి మల్లిక తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఈసీలో 20 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన బాలికలు ఈనెల 23న కళాశాలకు వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందాలన్నారు.

జీవో 49 నిలిపివేతపై హర్షం

బోథ్: జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయించిన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆదివాసీల తరఫున, కాంగ్రెస్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు పసుల చంటి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జీవో అమలవ్వకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీ హక్కుల రక్షణకు, వారి భూముల భద్రతకు కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందన్నారు. త్వరలోనే పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం కూడా ఉందని తెలిపారు.

టీయూసీఐలో పలువురి చేరిక



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రోగ్రెసీవ్ ఆటో స్టాండ్ మోటార్ వర్కర్స్ యూనియన్‌లో పలువురు ఆటో కార్మికులు చేరారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దళిత్ సమక్షంలో 30 మంది కార్మికులు సంఘంలో చేరినట్లు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు మెయింటనెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్, షకీల్, షహెబాజ్, ఖదీర్ ఖాన్, అజీమ్, అజీస్, జహీర్ పాల్గొన్నారు.

బోథ్‌లో ఏకధాటిగా కురిసిన వర్షం



పాఠశాల వద్ద నిలిచిన వరదనీరు

బోథ్: బోథ్, సొనాల మండలాల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలు కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. మురికికాలువలు నిండిపోవడంతో నీరంతా రోడ్డుపైకి వచ్చింది. వర్షం కురిసినంత సేపు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అన్నదాతల్లో హర్షం

నేరడిగొండ: మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. గత పది రోజులుగా వర్షం జాడలేకపోవడంతో ఆందోళనకు గురైన రైతన్నలు కురిసిన వర్షంతో ఆనందం వ్యక్తం చేశారు. పంటల ఎదుగుదలకు వర్షం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పరామర్శ

భీంపూర్: మండలంలోని గోమిత్రి గ్రామంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగయ్య యాదవ్ చిన్న కుమార్తె హర్షిత ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న తనయుడు మహేందర్ వారి కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు.

పేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'



చెక్కు అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

ఇచ్చోడ: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం సిరికొండ మండలంలోని సోన్‌పెల్లి గ్రామానికి చెందిన సిందే సౌజన్యకు మంజూరైన చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. బోథ్ ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ ఐబీలో..



ఇచ్చోడ: మాట్లాడుతున్న కొడప నగేశ్



బోథ్: నినాదాలు చేస్తున్న నాయకులు

బంద్ ప్రశాంతం

జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ నాయకులు సోమవారం పిలుపునిచ్చిన బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. వ్యాపారులు, పాఠశాల, కళాశాల యజమానులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు పలికారు. పలు మండల కేంద్రాల్లో ఆదివాసీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదివాసీలను అడవి నుంచి తరిమేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. జీవో రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామన్నారు. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, యువత స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



భీంపూర్: బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు



గుడిహత్నూర్: నిరసన తెలుపుతున్న నాయకులు



తలమడుగు: రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: నిర్మానుష్యంగా ముత్నూర్ మార్కెట్



తలమడుగు: దుకాణాలు బంద్ చేయిస్తున్న నాయకులు



నార్నూర్: నార్నూర్ గాంధీచౌక్ వద్ద..



సిరికొండ: మూసి ఉన్న దుకాణాలు

ఒంటికి రెంటికి ఆరుబయటకే..



ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉట్నూర్‌రూరల్: ఏళ్లు గడుస్తున్నా.. మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉట్నూర్ ప్రధాన కూడలి ఐబీ చౌరస్తా, పాత బస్టాండ్, పాత ఉట్నూర్, ఎక్స్ రోడ్డులో నేటికి పబ్లిక్ టాయ్‌లెట్లు లేక ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ రోజు వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. వారు ఉపయోగించుకునేందుకు పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ఒంటికి, రెంటికి బయటకు వెళ్తున్నారు. దీంతో ఆయా రోడ్లు గుండా వచ్చి పోయే వారు దుర్వాసన భరించ లేకపోతున్నారు.

బస్టాండ్ మరుగుదొడ్ల దుర్వాసన..

ఉట్నూర్ కేంద్రంగా ఇక్కడి నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ప్రజలు ప్రయాణిస్తుంటారు., ఉట్నూర్ బస్టాండ్‌లోని మరుగుదొడ్లు దుర్వాసన రావడంతో ఇబ్బంది పడుతున్నారు. గుడిహత్నూర్, జన్నారం వరకు పబ్లిక్ టాయిలెట్లు లేక అవస్థలు పడుతున్నారు., అత్యవసర సమయాల్లో ఒంటికి రెంటికి బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాసన భరించలేక పోతున్నాం



పబ్లిక్ టాయిలెట్లు లేక పోవడంతో బయటకు వెళ్తున్నారు. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రతీరోజు వేలమంది జన సంచారం ఉండే ఉట్నూర్ ఐబీ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. – అంజత్‌ఖాన్, సామాజిక కార్యకర్త

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: ఉట్నూర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు క్లెం నారాయణ్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సత్యవతి కోటేశ్, నాయకులు ముస్తాఫా, కొత్తుర్ లక్ష్మణ్, నడికుంటు ఆశన్న, శివకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

బోథ్: నిరుద్యోగ యువత కోసం ఉట్నూర్‌లో ఈనెల 25న నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ కోరారు. ఉద్యోగ మేళా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 50కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వైద్య ప్రజా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ అన్నారు. ఇటీవల హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం సర్టిఫికెట్ అందుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన బండారి నరేందర్, దీపక్ పుష్కర్‌లను శాలువాతో సన్మానించారు. రిమ్స్‌డైరెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, రమణాచారి, శ్రీకాంత్, ప్రమోద్, దయాకర్, నవీద్, మోసిన్, సచిన్, హరీశ్, రమేశ్, వివేక్, ప్రవీణ్ పాల్గొన్నారు.



రిమ్స్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

నేరడిగొండ: శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని ఎస్సై ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. సోమవారం కుప్టి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. నేరడిగొండ మండల ఎస్సైగా నూతన బాధ్యతలు చేపట్టి మెదటిసారిగా తమ గ్రామానికి వచ్చిన ఎస్సైను గ్రామస్తులతో పాటు సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య శాలువాతో సత్కరించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'

తాంసి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే గెలుపని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని లీమ్‌గూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల అధ్యక్షుడు కొడాల నారాయణ, సంతోశ్, రామన్న యాదవ్, చిల్కూరి చిన్నరాంరెడ్డి, రాజ్‌వలి, ధనుంజయ్, పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన గ్రామస్తులతో గజేందర్

'కాషాయ జెండా ఎగరవేద్దాం'

సాత్నాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక సంస్థలు ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు, వాటికి సంసిద్ధంగా ఉండాలన్నారు. అంతర్గత విభేదాలకు పోకుండా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకమన్నారు., టికెట్ ఎవరికిచ్చినా పార్టీ ఆదేశాల మేరకు అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జి క్రాంతికుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్, పోతురాజు రమేశ్, తిరుపతి, సంతోష్, శ్యామ్‌రావు, లింగారెడ్డి, మహేందర్, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పతంగి బ్రహ్మానందం

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

బోథ్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంపై నిరసనగా, ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ బోథ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలన్నారు.

కార్యాలయానికి పేరెక్కడ?



ఉట్నూర్‌రూరల్: ఏదైనా కార్యాలయానికి వెలితే ఆ కార్యాలయం గోడలపై లేదా బోర్డులపై ఆ కార్యాలయం పేరు రాసి ఉంటుంది. కొత్తగా వచ్చిన వారు ఇది సంబంధిత కార్యాలయం అని గుర్తు పడుతారు. అలాంటిది ఉట్నూర్ మండల విద్యాశాఖ కార్యాలయంపై పేరు లేక పోవడంతో కార్యాలయానికి ఆయా పనుల నిమిత్తం వచ్చి వెళ్లే వారు ఎంతవో కార్యాలయం ఇదే అని తెలియక తికమక పడుతున్నారు. అధికారులు కార్యాలయం పేరు రాయించాలని పలువురు కోరుతున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

తాంసి: మండలంలోని పొన్నారి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు తాగునీటి కోసం సోమవారం అంతరాష్ట్ర రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఐదు రోజులుగా తమ కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదని పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. ఈవిషయం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చేతిపంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అరగంటకు పైగా ఆందోళన చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అటువైపుగా వెళ్తున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్ వారి వద్దకు చేరుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గణేష్ గార్డెన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డోప్టాల గ్రామంలో సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో శ్రీరామాలయం పునర్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. బోరిగాం గ్రామంలో పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఎంద్రాల నగేశ్, తాక్రే మురళీధర్, బోయర్ విజయ్, దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, ఇంద్రశేఖర్, సలాం దేవ్‌రావు, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

జైనథ్: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో సోమవారం పంట పొలాలకు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని ఎంచుకొని రోడ్లు లేని పంట పొలాలకు రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జైనథ్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, విజయ్, వైభవ్, తరుణ్, అశోక్ రాకేశ్, ఆశిష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

జైనథ్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి యువత బీజేపీలో చేరుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జైనథ్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన సుమారుగా 150 మంది యువకులు బీజేపీలో చేరారు.


దరఖాస్తుల ఆహ్వానం

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరి గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ ఉద్యోగాలకు, అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు పీజీ, బీఈడీ అర్హత కలిగిన అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఆర్. సరస్వతి సోమవారం తెలిపారు. ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు కేజీబీవీ పాఠశాల గాదిగూడలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

బేల: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీ సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి గేడం నవీన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 8, ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీలో 10, ఎంపీసీ 30సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సిరికొండ: సిరికొండ కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ ఉద్యోగాలు, అతిథి అధ్యాపకులుగా నియమాకం కోసం సంబంధిత ఇంగ్లిష్, కెమిస్ట్రీ, బోటనీ, సబ్జెక్టుల్లో పీజీ, బీఎడ్ అర్హత కలిగి ఉన్న మహిళ అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు కేజీబీవీ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల స్పెషల్ ఆఫీసర్ సంధ్య రాణి తెలిపారు.

ముగిసిన లింగాష్టక పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక లింగాష్టక పారాయణం సోమవారంతో విజయవంతంగా ముగిసింది. పారాయణం ఈ ఏడాది మార్చి 3న ప్రారంభ కాగా, 21 వారాల పాటు ప్రతీ సోమవారరం కొనసాగింది. భక్తులు, కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొని లింగాష్టక పారాయణాన్ని ప్రతివారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిజ్జురి గంగారెడ్డి మాట్లాడుతూ.. పారాయణంలో పాల్గొన్న భక్తులు, అన్నదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామాయి రాము, చిలుకూరి నరేందర్, పసుపునోటి గంగాధర్, మామిళ్ల రవి, కడారి రమేశ్ పాల్గొన్నారు.